بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 30 Oct 2026 (Telugu)

సంతృప్తి, సాధారణ జీవనం మరియుల నిరాడంబరతలో
మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర ఆదర్శం జీవితం

హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 30.10.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టీల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నిరాడంబర జీవితం, సాధారణ జీవనశైలి గురించి ప్రస్తావన జరుగుతుంది. గత వారం ఈ క్రమంలో ఆయన ఆహారపు అలవాట్లలోని నిరాడంబరత, భోజనం చేసే పద్ధతి మరియు ఆయన సాధారణ జీవన ప్రమాణం ఎలా ఉండేదనే విషయాల గురించి వివరించడం జరిగింది.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు తఆలా అన్హు ఇలా ప్రవచించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి చర్యలోనూ ఒక నిరాడంబరత, సహజత్వం కనిపించేవి. ఉత్తమమైన, విలాసవంతమైన ఆహారానికి అలవాటుపడిన ప్రజలు దైవ ప్రవక్త (స) కూడా ఎల్లప్పుడూ అత్యుత్తమమైన ఆహారమే భుజించే వారని, ఆయన ముందు రాజభోజనం వడ్డించబడేదని అనుకోవచ్చు. కానీ వాస్తవాలు దీనికి విరుద్ధంగా ఉండేవని తెలుసుకుంటే వారు ఆశ్చర్యపోతారు. దైవ ప్రవక్త (స) ఒకవైపు నిరాడంబరతకు పరిపూర్ణ ఆదర్శంగా ఉంటే మరోవైపు ఆ సాధారణ జీవనంలోనూ ఆయన ప్రపంచానికి ఒక మార్గదర్శిగా నిలిచారు.

హుజూరె అన్వర్ ఇలా తెలిపారు: హజ్రత్ ఆయిషా (రజి.) తమ మేనల్లుడైన ఉర్వాను ఉద్దేశించి ఇలా అన్నారు: ఓ నా మేనల్లుడా! మేము ఒక నెలవంక తర్వాత మరొక నెలవంకను చూసేవాళ్ళం, చివరకు మూడు నెలవంకలు కనిపించేవి. అంటే రెండు నెలల కాలం గడిచిపోయినా దైవ ప్రవక్త (స) ఇంట్లో పొయ్యి వెలిగేది కాదు. అప్పుడు ప్రశ్నించిన వ్యక్తి, మరి మీరు ఏమి తినేవారు? అని అడిగారు. దానికి హజ్రత్ ఆయిషా (రజి.) సమాధానమిస్తూ, నీళ్లు, ఖర్జూరాలు తీసుకునేవాళ్ళం. అలాగే అన్సార్ పొరుగువారు మేకల పాలను పంపేవారని చెప్పారు. సుబ్హానల్లాహ్! ఎంతటి నిరాడంబరమైన జీవితం! రెండు నెలల పాటు అసలు పొయ్యే వెలగకపోవడం, కేవలం ఖర్జూరం, నీరు, పాలతోనే గడపడం! ఈ చరిత్రను చూసి ముస్లింలు సిగ్గుపడాలి. నేడు ముస్లింలలోని కొందరు ధనికులు సైతం ఆహార విలాసాల ఈ వ్యాధి బారిన పడ్డారు. వారిని చూసి తక్కువ స్తోమత ఉన్నవారు కూడా అవసరానికి మించి ఖర్చు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి.) ఇలా పేర్కొన్నారు: ముస్లింల సంపాదన తిండి, విందుల కోసమే అధికంగా ఖర్చయిపోతుంది, చివరకు వారు అప్పులపాలు అవుతున్నారు.

హుజూరె అన్వర్ ఇలా తెలిపారు: ఈ రోజుల్లో మన ఆహారపు అలవాట్ల ప్రమాణాలు బాగోలేవు. కోరికలు, ఆశలు పెరిగిపోతున్నాయి. వాస్తవానికి ఎంత ఆదాయం ఉంటే దానిలోనే సర్దుకుపోవాలి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒకవైపు నిరాడంబరతకు ఆదర్శంగా నిలిస్తే, మరోవైపు సన్యాస భావనను కూడా ఆయన అయిష్టపడే వారని హుజూరె అన్వర్ పేర్కొన్నారు. ఒకవేళ ఎవరైనా అత్యుత్తమమైన ఆహారాన్ని సమర్పించినా దానిని కూడా

ఆయన స్వీకరించేవారు. అంతేగానీ, ప్రాపంచిక త్యాగం లేదా తపస్సు పేరిట తినడానికి నిరాకరించేవారు కాదు. ఈ లక్షణమే ఆయనను ఇతరుల కంటే శ్రేష్ఠుడిగా నిలుపుతుంది. ఎందుకంటే ఆయన ఏ ఒక్క వర్గానికో కాక సమస్త మానవాళి కోసం వచ్చారు. కనుక ఆయన పరిపూర్ణమైన ఆదర్శంగా ఉండడం అనివార్యం. ఆయన ఒకవైపు సాధారణ జీవనంలో పరిపూర్ణతను కలిగి ఉంటే, మరోవైపు పవిత్ర వస్తువులను ఉపయోగించడానికి కూడా సంకోచించే వారు కాదు. అయితే సాధారణంగా ఆయన జీవనం అత్యంత నిరాడంబరంగానే సాగేది. ప్రాణం నిలబడటానికి, విధులు నిర్వర్తించడానికి అవసరమైన శక్తి లభించడానికి మాత్రమే ఆయన ఆహారాన్ని తీసుకునేవారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ జీవితంలో అన్ని రకాల అత్యుత్తమ ఆహారాలను స్వీకరించే ఆదర్శాన్ని చూపించారు. అదే సమయంలో నిరాడంబర జీవన విధానం ద్వారా, విలాసవంతమైన భోజనం, వస్త్ర ధారణే జీవిత పరమావధిగా భావించే మన సమాజంలోని ధనికులకు సైతం ఒక గొప్ప మార్గదర్శకత్వాన్ని నెలకొల్పారు.

హుజూరె అన్వర్ ఇలా తెలిపారు: మంచి ఆహారాన్ని స్వీకరించడం గురించి ఒక ఉల్లేఖనం ఉంది. దాని ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మేక భుజం భాగం మాంసాన్ని ఆరగిస్తూ ఉండేవారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కత్తితో మాంసాన్ని కోసుకొని తిన్నారు, తన సమాజం ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఆయన ఈ పని చేశారు. సమంజసమైన అవసరాల కోసం ఆ విధంగా తినడం అనుమతించదగినదే. కానీ దానికి మాత్రమే కట్టుబడిపోయి ఆడంబరాలకు పోవడం, ఇతర పద్ధతులను చిన్నచూపు చూడడం నిషేధం. ఇతర జాతులను గుడ్డిగా అనుసరించడం మొదలుపెడితే మనిషి పవిత్రతను కూడా విడిచిపెట్టే ప్రమాదం ఉంది. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం కొన్నిసార్లు పని చేసుకుంటూ టేబుల్ వద్ద కూడా భోజనం చేసేవారు, అలాగే నేలపై కూర్చుని కూడా తినేవారు.

హుజూరె అన్వర్ ఇలా పేర్కొన్నారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వివాహం, వలీమా (వివాహ విందు) గురించి ఒక ఉల్లేఖనం లభిస్తుంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ సఫియ్యా (రజి.)ను దాస్యవిముక్తురాలిని చేసి ఆమెను వివాహం చేసుకున్నారు. ఆమెను విముక్తురాలిని చేయడమే ఆమె 'మహర్' అయింది. ఆ ప్రయాణంలోనే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఉదయాన ఒక భోజన వస్త్రం పరిచి, ఎవరి వద్ద ఏముంటే అది తీసుకురమ్మని అందరికీ చెప్పారు. ఒకరు ఖర్జూరాలు తీసుకువచ్చారు, మరొకరు నెయ్యి, ఇంకొకరు సత్తు తీసుకువచ్చారు. ఆ తర్వాత వాటన్నింటినీ కలిపి ముద్దగా చేశారు, అదే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వలీమా విందు అయింది.

హుజూరె అన్వర్ ఇలా పేర్కొన్నారు: ఆయన (స) ప్రతి ఒక్కరి ఆహ్వానాన్ని ఆదరంగా స్వీకరించేవారు. హజ్రత్ అనస్ (రజి.) ఉల్లేఖించిన ప్రకారం ఒక దర్జీ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను విందుకు ఆహ్వానించారు. హజ్రత్ అనస్ (రజి.) ఇలా చెప్పారు. నేను కూడా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి ఆ విందుకు వెళ్లాను. అతను సముఖంలో బార్లీ రొట్టె, సొరకాయ, ఎండిన మాంసం ముక్కలతో కూడిన పులుసును సమర్పించాడు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో గిన్నె అంచుల నుండి సొరకాయ ముక్కలను వెతికి మరీ తింటుండడం నేను చూశాను. ఆ రోజు నుండి నాకు కూడా సొరకాయ అంటే ఎంతో ఇష్టం ఏర్పడింది.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి.) ఇలా పేర్కొన్నారు: సొరకాయ అంటే ఆయనకు ఎంతో ఇష్టం. ఆ తర్వాత ఆయనకు ఆహారం కూడా దొరకని గడ్డు కాలం కూడా వచ్చింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో మంచి మాంసం ఎందుకు తిన్నారు, ఆయన శ్రేష్ఠమైన రాజరికం లాంటి పానీయాలు ఎందుకు తాగారు, నాణ్యమైన వస్తువులను ఎందుకు ఉపయోగించారు అని ప్రశ్నించేవాడు నిజంగా మూర్ఖుడు. ఎందుకంటే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో పస్తులు కూడా ఉన్నారని, ఆకలికి తాళలేక కడుపునకు రాళ్ళు కట్టుకున్నారని వాడు గమనించడు. ఆయనపై ఎలాంటి పరిస్థితులు వచ్చాయంటే ఒక నిరుపేద స్త్రీ ఆయన ఇంటికి యాచించడానికి వచ్చినప్పుడు, ఆ

రోజు తమ ఇంట్లో ఏమీ లేదని, వెతకగా కేవలం ఒక్క ఖర్జూరం మాత్రమే దొరికిందని హజ్రత్ ఆయిషా (రజి.) తెలిపారు. ఆ స్త్రీ ఆ ఖర్జూరాన్ని రెండు ముక్కలు చేసి తన ఇద్దరు కుమార్తెలకు పంచింది. హజ్రత్ ఆయిషా (రజి.) ఈ సంఘటనను దైవ ప్రవక్త (స) వద్ద ప్రస్తావించారు. అప్పుడు ఆయన ఎవరి ఇంట్లోనైనా ఇద్దరు ఆడపిల్లలు ఉండి, వారు వారిని ఉత్తమ రీతిలో పెంచి పోషిస్తే, అల్లాహ్ వారికి స్వర్గాన్ని తప్పనిసరి చేస్తాడని వివరించారు.

హుజూరె అన్వర్ ఇలా పేర్కొన్నారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రను ఎవరైనా విన్నా లేదా చదివినా, అందులో వివరించబడిన ప్రతి సంఘటనలోనూ వ్యక్తిత్వ వికాసం, వివేకం, సద్బోధల గురించి అనేక కోణాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఈ ఉల్లేఖనంలో కూడా మనకు అదే కనిపిస్తుంది. హుజూరె అన్వర్ ఇంకా ఇలా పేర్కొన్నారు: దీబాచా తఫ్సీరుల్ ఖురాన్'లో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రను వివరిస్తూ హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి.) ఇలా వ్రాశారు. దైవ ప్రవక్త (స) ఆహారపు అలవాట్లలో నిరాడంబరతను తప్పక పాటించేవారు. ఆహారంలో ఎప్పుడైనా ఉప్పు ఎక్కువైనా, లేకపోయినా, లేదా వంట సరిగ్గా కుదరకపోయినా ఆయన ఎన్నడూ కోపాన్ని ప్రదర్శించేవారు కాదు. సాధ్యమైనంత వరకు అలాంటి ఆహారాన్ని కూడా తింటూ, వండిన వారి మనస్సు నొచ్చుకోకుండా చూసుకునేవారు; ఒకవేళ నచ్చకపోతే మౌనంగా చేతిని వెనక్కి తీసుకునేవారే తప్ప ఆ విషయాన్ని బయటకు వ్యక్తం చేసేవారు కాదు. ఏదైనా తినే వస్తువు వస్తే అనుచరులతో పంచుకుని తినేవారు. ఒకసారి ఖర్జూరాలు వచ్చినప్పుడు, అనుచరులకు తలా ఏడు ఖర్జూరాల చొప్పున పంచిపెట్టారు.

హజ్రత్ ఆయిషా (రజి.) ఇలా ఉల్లేఖించారు. నేను దైవ ప్రవక్త (స) ఎవరినీ ఎన్నడూ దూషించడం చూడలేదు. అలాగే ఆయన కోసం ఎప్పుడూ ఏ దుస్తులూ మడతపెట్టి ఉంచబడలేదు. అంటే ఆయన వద్ద ఒకే జత బట్టలుండేవి తప్ప, మడతపెట్టి భద్రపరచడానికి రెండో జత ఉండేది కాదు. బట్టలు ఉతికిన తర్వాత వాటిని అలాగే ఉతికి, నీటి తడి గుర్తులు కనిపిస్తున్నప్పటికీ ధరించి బయటకు వచ్చేవారు. ఏ హోదా, స్తోమత గల వ్యక్తి కూడా చూపించలేని, నేటికి ఎవరూ చూపించని అత్యున్నత నిరాడంబరతకు ఇది నిదర్శనం. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి.) ఉల్లేఖనం వివరాల ప్రకారం హజ్రత్ ఉమర్ (రజి.) మార్కెట్‌లో అతారద్ తమీమీ అనే వ్యక్తి చారల పట్టు వస్త్రాన్ని అమ్ముతుండడం చూశారు. అతను రాజుల వద్దకు వెళ్లి బహుమతులు పొందేవాడు. దీనిపై హజ్రత్ ఉమర్ (రజి.) దైవ ప్రవక్త (స)ను వేడుకుంటూ: ఓ దైవ ప్రవక్తా! అతారద్ అటువంటి వస్త్రాన్ని అమ్ముతుండడం నేను చూశాను. ఎవరైనా రాయబారులు మీ వద్దకు వచ్చినప్పుడు మీరు దానిని ధరిస్తే మంచి ప్రభావం ఉంటుంది. లేదా కనీసం శుక్రవారం రోజైనా దానిని ధరించవచ్చు కదా అని విన్నవించారు. దానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్పందిస్తూ ఈ లోకంలో పట్టు వస్త్రాలను పరలోకంలో ఎలాంటి వాటా లేనివారు మాత్రమే ధరిస్తారని బాదులిచ్చారు.

ఈ సంఘటనల ప్రస్తావన అనంతరం హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి.) ఇలా పేర్కొన్నారు: వస్త్రధారణ విషయంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతటి నిరాడంబరతను పాటించేవారంటే, నిజానికి ఈ పరిస్థితుల గురించి చదువుతుంటే నాకు సిగ్గేస్తుంది. నిస్సందేహంగా నేడు పరిస్థితులు మారిపోయాయి, అయినప్పటికీ ఈ ఉదంతాలను చదివినప్పుడు సిగ్గు కలగక మానదు. వస్త్రాల వ్యత్యాసాన్ని పక్కన పెట్టి చూసినా కూడా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితం అత్యంత నిరాడంబరంగా సాగింది; అటువంటి నిరాడంబరత లేకుండా ప్రపంచ ప్రగతికి అవసరమైన మార్గం సుగమం అయ్యేది కాదు.

హజ్రత్ సమ్రా బిన్ జుందుబ్ (రజి.) ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త (స) ఇట్లనిరి. తెల్లటి వస్త్రాలను ధరించండి, ఎందుకంటే అవెంతో పవిత్రమైనవి, అత్యుత్తమమైనవి. అలాగే మీ మృతులకు కూడా వాటితోనే దహన వస్త్రం సమర్పించండి. మరొక ఉల్లేఖనంలో దైవ ప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: మనిషి కడుపు కంటే చెడ్డ పాత్రను దేన్నీ నింపలేదు. ఆదం సంతానానికి తన నడుమును నిటారుగా ఉంచడానికి కొన్ని ముద్దల ఆహారం సరిపోతుంది. అంటే కడుపు కూడా ఒక పాత్ర లాంటిదే. దానిని నింపుతూ పోతే అందులో రుగ్మతలే పుట్టుకొస్తాయి.

ఆ తర్వాత ఆయనిలా చెప్పారు: కడుపులో ఒక భాగం ఆహారానికి, ఒక భాగం నీటికి మరిక భాగం శ్వాస కోసం ఉంచండి. అంటే కొంత ఆకలి మిగిలి ఉండగానే తినడం ముగించాలి. జీర్ణకోశ సమస్యలతో బాధపడేవారికి నేడు వైద్యులు ఇచ్చే సలహా కూడా సరిగ్గా అదే, ఇది పద్నాలుగు వందల సంవత్సరాల క్రితమే దైవ ప్రవక్త (స) ప్రసాదించారు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి.) ఇలా పేర్కొన్నారు. సాదా జీవనశైలి కారణంగా ప్రజలు కష్టాలను తట్టుకునే అలవాటును పెంచుకుంటారు. కష్టకాలాలు ఎదురైనా కూడా వారికి ఆ బాధల భారం పెద్దగా అనిపించదు. ఆయనింకా ఇట్లనిరి: నేడు మనం చూస్తున్నట్లే, ఐరోపా దృష్టిలో ఏవైతే తీవ్రమైన కష్టాలుగా భావించబడుతున్నాయో, అవి మన నిత్యజీవితంలో సాధారణ వ్యవహారాలుగా మారిపోయాయి. వారు వేటినైతే విపత్తులు, కష్టాలుగా భావిస్తారో, అవి మన దృష్టిలో సుఖసంతోషాలు, ప్రశాంతతలే.అందుకే అటువంటి బాధలు మనకు కష్టంగానే తోచవు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి.) ఇంకా ఇలా తెలియజేశారు. కొద్ది రోజుల క్రితం కొందరు నాతో వస్త్రాలు దొరకడం కష్టంగా మారిందని చెప్పారు. అయితే ఒక నిజమైన విశ్వాసి స్థితి ఎలా ఉండాలంటే వస్త్రం లభిస్తే ధరించాలి, లభించకపోతే పాత వస్త్రానికే అతుకులు వేసుకుని కాలం గడపాలి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ధరించే వస్త్రాలకు కూడా అతుకులు ఉండేవి. మరి మన వస్త్రాలకు అతుకులు వేసుకోలేనంత గొప్పవారమా మనం?

హుజూరె అన్వర్ ఇలా పేర్కొన్నారు: నేటి ప్రపంచంలో కష్టాల నడుమ ఇది దొరకడం లేదు, అది లభించడం లేదు అంటూ ఒకటే హాహాకారాలు వినిపిస్తున్నాయి. మరి రేపు ప్రపంచ యుద్ధమే గనక మొదలైతే పరిస్థితులు ఇంకెంత దిగజారిపోతాయో తెలియదు. యుద్ధ పరిస్థితులు నానాటికీ పెరిగిపోతున్నాయని నేను ఇంతకుముందు కూడా ఎన్నో సార్లు చెప్పాను. ఒకవేళ యుద్ధం మరింత విస్తరిస్తే ఐరోపా మాత్రమే కాకుండా యావత్ ప్రపంచం ఆహార కొరత పరంగా అత్యంత గడ్డు కాలాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి.) ఆనాటి భారతదేశాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. కానీ ఆఫ్రికా, అల్పాభివృద్ధి చెందిన దేశాల పరిస్థితి ఏమిటంటే, వారికి కనీసం సాధారణ ఆహారం దొరికినా ఎంతో సంతోషిస్తారు. అటువంటి ప్రజలు యుద్ధ పరిస్థితులను తట్టుకోగలరు. కానీ ఐరోపా, ఈ అభివృద్ధి చెందిన దేశాలు ఆ పరిస్థితులను ఏమాత్రం భరించలేవు, ఆ పరిణామాలు వారిని తీవ్రంగా కలవరపెడతాయి. కాబట్టి మనం కూడా మన స్థితులను నిరంతరం సమీక్షించుకుంటూ, తృప్తి భావాన్ని అలవరచుకోవాలి. నిరాడంబరమైన జీవనాన్ని గడపడానికి ప్రయత్నించాలి. దైవ ప్రవక్త (స) చూపిన ఆదర్శాన్ని, ఆనాటి కాలాన్ని మన కళ్ళముందు ఉంచుకోవలెను. మంచి వస్తువులు, ఉత్తమ ఆహారాలు అందుబాటులో నున్నప్పుడు తప్పకుండా స్వీకరించాలి. మంచి దుస్తులు లభిస్తే తప్పక ధరించాలి. కానీ వాటిపైనే పూర్తిగా ఆధారపడిపోవడం, ఒకవేళ అవి దొరకనప్పుడు అయ్యో చచ్చిపోయాం అంటూ హాహాకారాలు చేయడం మాత్రం సరైన పద్ధతి కాదు. ఏది ఏమైనప్పటికీ, అల్లాహ్ ఈ ప్రపంచాన్ని ఇటువంటి విపత్తుల నుండి కాపాడాలని మనం ప్రార్థించాలి. తమ అహంకారాల కారణంగా ఈ దేశాలు వినాశనం అనే గోతిలో పడటానికి సిద్ధపడుతున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రపంచ యుద్ధం అనివార్యం, ఆ తర్వాత వారి సర్వనాశనం కూడా తథ్యం. ఇతరుల సంపదను, భూములను ఆక్రమించుకోవడానికి బదులు, ఈ నాయకులు తమ ప్రజలకు సేవ చేయడంపై దృష్టి సారించాలి. అల్లాహ్ మనందరికీ కూడా సదా సన్మార్గంలో స్థిరంగా ఉండే భాగ్యాన్ని ప్రసాదించుగాక!

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔